భగభగలతో మళ్లీ బెంబేలు!

- గత కొన్నిరోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- వడగాలులు, ఉక్కపోతకు అల్లాడుతున్న ప్రజలు
- ఉదయం 10 దాటితే నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు



ఎండ తీవ్రతకు జన సంచారం లేక వెలవెల బోతున్న 216 జాతీయ రహదారి



మండుతున్న ఎండకు ముసుకు వేసుకుని వెళుతున్న మహిళలు, చిన్నారి

చెరుకుపల్లి: గత వారం రోజులుగా భానుడి భగభగలకు పగలు రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు హడలెత్తి పోతున్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఉదయం 10 గంటలకే ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వాస్తవానికి మే నెల చివరి వారంలో భారీ వర్షాలు కురిసి, వాతావరణం చల్లబడి ప్రజలు ఎంతో ఆనందించారు. దీంతో ఈ ఏడాది వేసవి ముగిసిందని అంతా సంబరపడ్డారు.. రైతులు ఖరీఫ్ పనులకు సిద్ధపడ్డారు. అయితే అనుకోని విధంగా మళ్లీ వాతావరణం మారిపోయింది. విపరీతమైన ఎండలు, ఉక్కపోత, వడగాడ్పులు వీస్తున్నాయి. ఉక్కపోత, వేడిగాలులు అధికం అవ్వటంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. గత వారం రోజులుగా మండల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి, దీంతో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతూ.. నెత్తి మీద టోపీలు, కండువాలు, వెంట గొడుగులు ఉంటే తప్ప బయటకు రాలేక పోతున్నారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పెరుగుతున్న ఎండ తీవ్రత నుంచి సురక్షితంగా ఉండేందుకు బయటకు వెళ్లేటప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రోడ్ల మీదకు వెళ్లకుండా ఉండాలి. మిగిలిన వారు ఈ సమయాల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తీసుకోవాలి. ప్రభుత్వ వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు ప్రధాన కూడళ్లలో వడదెబ్బ తగలకుండా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తే మంచిది.

– డాక్టర్ ఈవూరి కేశవతి, ఈవూరి సుబ్బారావు మెమోరియల్ హాస్పిటల్ వైద్యురాలు

శీతల పానియాలకు మళ్లీ డిమాండ్



ఎండవేడిమికి కూల్‌డ్రింక్ షాపుల వద్ద జనం రద్దీ

ఈ ఏడాది ఇక ఎండాకాలం ముగిసింది. ఇక వ్యాపారాలు అంతగా సాగవు అని అనుకుంటున్న సమయంలో విపరీతమైన ఎండలతో శీతల పానియాల వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. ఉదయం నుంచే కాస్తున్న ఎండ తీవ్రతకు ప్రయాణికులు కూల్‌డ్రింక్స్, జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, కొబ్బరి బొండాల వైపు ఆసక్తి చూపుతున్నారు. వాటితో దాహార్తి తీర్చుకుంటున్నారు. మరో వైపు తాటి ముంజల కొనుగోలు సైతం పెరిగింది.

వెలవెలబోతున్న కూడళ్లు

మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్, సంతబజారు, గుళ్ళపల్లి లోని కోటీ సెంటర్‌లు నిత్యం ప్రజలు, ప్రయాణికులతో కిటకిటలాడతాయి. నేడు ఎండల దెబ్బకు ఆ కూడళ్లన్నీ వెలవెలబోతున్నాయి. దీంతో స్థానిక పండ్లు, కూరగాయల వ్యాపారులు బేరాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

జల్ జీవన్ మిషన్‌తో అందరికీ తాగునీరు



చందోలు(కర్లపాలెం): జల్ జీవన్ మిషన్ ద్వారా అందరికీ తాగు నీరందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు పంచాయతీ కత్తివారిపాలెంలో జల్ జీవన్ నిధులు రూ.76లక్షల వ్యయంతో చేపట్టనున్న పైప్‌లైన్ ఏర్పాటు పనులకు ఆదివారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ శంకుస్థాపన చేశారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, టీడీపీ పరిశీలకుడు బొంతు సాంబశివారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దిరిశాలమ్మ విగ్రహ ప్రతిష్ట



నగరం: నగరం మండలం పెద్దవరం గ్రామంలో దిరిశాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో మొక్కుబడులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోట రాజకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

15న 'కేసన'కు సత్కారం



తెనాలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావుకు ఈనెల 15న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అభినందన సత్కారం జరగనుంది. పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. చినరావూరు వాకర్స్ సొసైటీ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలంటూ బీసీ సంక్షేమ సంఘం తరపున కేసన శంకరరావు దీర్ఘ కాలంగా ఉద్యమిస్తున్నారనీ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసినట్టు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణనకు సిద్ధమైన తరుణంలో కేసన శంకరరావును సత్కరించనున్నట్టు తెలిపారు. ఇదే సభలో శంకరరావు అభినందన సంచికను విడుదల చేస్తామన్నారు. సభకు కేంద్ర, రాష్ట్రమంత్రులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఓంకార్ ప్రసాద్, అక్కల వెంకటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీం జాని, బి.నరసింహారావు, ఎ.సాంబశివరావు, ఎం.మల్లికార్జునరావు, సీహెచ్. సాంబశివరావు, ఎ.ఏడుకొండలు, ఈఎల్‌వీ అప్పారావు, పూర్ణచంద్రరావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'బొల్లిముంత'



తెనాలి: ప్రజల అభ్యుదయమే ఆశయంగా అగ్రశ్రేణి రచనలు చేసిన ప్రజా రచయిత బొల్లిముంత శివరామకృష్ణ చిరస్మరణీయులని రచయిత రంగిశెట్టి రమేష్ అన్నారు. గాంధీనగర్ 'ఇస్కఫ్' కార్యాలయంలో ఆదివారం అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో జరిగిన శివరామకృష్ణ సాహిత్య గోష్ఠికి ఆయన అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయునిగా జీవితాన్ని ఆరంభించి, హార్మోనిస్టుగా, నటుడుగా, గాయకుడిగా, కవి, కథా రచయిత, నవలాకారుడు, బుర్రకథ, హరికథ రచయిత, జర్నలిస్టు, సినిమా రచయిత, అరసం నాయకుడుగా శివరామకృష్ణ బహుముఖాలుగా సమాజ శ్రేయస్సుకు కృషి చేశారని సోదాహరణంగా చెప్పారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బీవీ రావు మాట్లాడుతూ శివరామకృష్ణ మాటలలు రాసిన 'నిమజ్జనం' సినిమాకు రాష్ట్రపతి అవార్డు రాగా, 'కాలం మారింది' చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ అవార్డు లభించిందని చెప్పారు. మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, ఆళ్ల నాగేశ్వరరావు, కనపర్తి బెన్‌హర్, ఎంవీ రఘునాథరావు, కె.విజయసారథిబాబు, వినుకొండ శ్రీరామమూర్తి, చందు సూర్య, వీణ, విజయలక్ష్మి, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది కవులతో కవితా గానం జరిపారు.

చెన్నమల్లేశ్వరుని కల్యాణోత్సవాలు ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సుప్రభాత సేవలతో వేద మంత్రాల నడుమ స్వామివారికి మంగళస్నానాలు చేయించి పెండ్లికుమారుడిని చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచన, కంకణధారణం, దీక్షా స్వీకరణ, అఖండస్థాపన, వాస్తు మండల పూజ, వాస్తు హోమం, అంకురారోహణ, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈఓ దివి వెంకట అప్పలాచార్యులు మాట్లాడుతూ 9న స్వామివారి కల్యాణం, 10న గ్రామోత్సవం, పూర్ణాహుతి, వసంతోత్సవం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయని, వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ప్రత్యేక పూజలందుకుంటున్న చెన్నమల్లేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు

ఈ ఏడాదైనా 'అన్నదాత సుఖీభవ' ఉందా ?

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలి: అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేల ఆర్థికసాయం ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూరల్ మండల గ్రామం గుడివాడలో కౌలు రైతులు, రైతులను ఆయన కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ యజమానులకు అన్నదాత సుఖీభవ ఇచ్చినా గానీ కౌలు రైతులకు కూడా అదే పథకం కింద ఆర్థికసాయం ఇస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం అసలు ఆ పథకం అమలు చేయలేదని తెలిపారు. ఈ సంవత్సరం జూన్‌లో ఇస్తామని హామీలు గుప్పించటం మినహా, ఆచరణలో ఇస్తారా? లేదా? అనే ఆందోళన కౌలు రైతుల్లో నెలకొందని పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వం జొన్నలు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన చెందారు. దీంతో దళారులు తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారని చెప్పారు. భూమి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలని విన్నవించారు. కౌలు రైతులు, సాగుదారుల పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న మంగళగిరి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు. రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్ వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి సీసీఎల్ఏ, వ్యవసాయ శాఖ కమిషనర్లకు వ్యక్తిగత అర్జీలతో పాటు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌలు రైతులందరూ అర్జీలు తీసుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్‌రావు, మోషే, గొట్టిముక్కల ప్రేమయ్య పాల్గొన్నారు.

జూలై 10 నుంచి టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం-తూర్పు గుంటూరు సినడ్ క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) శత వార్షికోత్సవాలకు అంకురార్పణ చేశారు. చర్చి ప్రాంగణంలో జులై 10,11,12 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాల పోస్టరును ఆదివారం ఆవిష్కరించారు. ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగుగ్మల్లి సాల్మన్‌రాజు, వీబీ ప్రకాష్‌బాబు మత్తె, అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఐనంపూడి డేవిడ్‌రాజు, డాక్టర్ శ్యామ్‌ప్రకాశరావు గారపాటి, చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, సుదర్శనం జాన్‌మోహన్, చెరుకూరి సునీల్‌కుమార్, కారుమంచి చంద్రకుమార్, గ్లోరీ దేవదానం, గురిందపల్లి వేమయ్య, కొమ్మెర్ల అంబేడ్కర్, బేతాళ కిశోర్‌బాబు, బడుగు బుజ్జిబాబు, నక్కా కృపా సాగర్, జొన్నకూటి శ్యామ్‌కుమార్, గేరా రాజు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కమిటీ సభ్యులు

ఎముకల అరుగుదలపై అవగాహన అవసరం

ఆర్థోపెడిక్ వైద్యుడు టి.రాకేష్

తెనాలి: శరీరంలోని కీళ్ల అరుగుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఆర్థోపెడిక్ వైద్యుడు టి.రాకేష్ సూచించారు. తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మే, జూన్ నెలల సంయుక్త సమావేశం ఆదివారం అమరావతి కాలనీలోని ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు అధ్యక్షత వహించారు. 'ఎముకలు అరుగుదల సమస్యలు' అంశంపై డాక్టర్ రాకేష్ అవగాహన కల్పించారు. కీళ్ల అరుగుదలకు సమస్యలకు డాక్టర్ సలహాతో మందులు వాడుకోవాలని ఆయన సూచించారు. బీపీ, షుగర్ బాధితుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. నొప్పుల టాబ్లెట్లు, ప్రొటీన్లు, డీ విటమిన్లు వాడుతూ, వ్యాయామం చేస్తుంటే ఫలితం ఉంటుందని వివరించారు. ప్రతి సమస్యకీ మందు బిళ్లలే ఉపశమనం కలగజేయవని చెప్పారు. కీళ్లకు సంబంధించి సర్జరీ చేయించుకునేవారు డాక్టర్ సూచనలు మేరకు అనంతరం ఫిజియోథెరపీ చేయించుకోవడం అవసరమని సూచించారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ రాకేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆలపాటి వెంకటరామయ్య, గుంటుపల్లి భాస్కరరావు, ఉన్నవ సూర్యనారాయణ, పూపూరి శివప్రసాద్, కె.రాజేంద్రప్రసాద్, వై.గాంధీ ప్రసాద్, డి.సాయిబాబు, జి. రమేష్, బి. సాంబశివరావు, యు. వెంకటేశ్వరరావు, పి.రమేష్ పాల్గొన్నారు, వార్డు కౌన్సిలర్ జయపాల్ స్వాగతం పలుకగా, సంఘ కార్యదర్శి కె.నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు.



డాక్టర్ రాకేష్‌కు సత్కారం

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం

వేమూరు: మార్కెట్ యార్డు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వేమూరు మార్కెట్ యార్డు నూతన చైర్‌పర్సన్‌గా గొట్టిపాటి అన్నపూర్ణ కుమారి, పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ నూతన పాలక వర్గం మార్కెట్ యార్డు ద్వారా రైతులకు సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ యార్డులో రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు దండే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గొట్టిపాటి పూర్ణకుమారి

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

తెనాలి అర్బన్: యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం యోగా శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యోగాకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతో పాటు శారీరక రుగ్మతులు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో దీప్తి, పలువురు యోగా సాధకులు, వృద్ధులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

విలువలతో కూడిన సమాజ ఆవిష్కరణ ఆశయం

'మానవత' వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి

తెనాలి: విలువలతో కూడిన సమాజ ఆవిష్కరణ తమ ఆశయమని ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ 'మానవత' వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఈ భూమిపై జన్మించినందుకు శాంతిగా జీవించాలని, తర్వాతి తరం కూడా శాంతిగానే బతికేలా చూడాలంటే అందరం విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని అభిప్రాయపడ్డారు. తెనాలి వచ్చిన సందర్భంగా ఆదివారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో మానవత సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మేధోపరంగా ఎదిగినప్పటికీ డబ్బు, హోదా, రాజకీయం వంటి ఏదొక వైరుధ్యంతో సంకుచితంగా తయారైనట్టు చెప్పారు. నేటి కలుషిత సమాజంలో అభద్రత, బతుకు భయంతో గడుపుతున్న ఎందరికో అండదండలనిస్తూ భరోసాగా నిలవాల్సి ఉందని తెలిపారు. సేవలు చేయటమే కాకుండా ఇబ్బందులు పడేవారికి, బాధితుల తరపున అండగా ఉండాలని సూచించారు. విలువలతో కూడిన వ్యక్తుల కలయికతో ఒక శక్తి వస్తుందని చెబుతూ వారి కార్యక్రమాలకు ఇతరులు ప్రభావితం కాగలరని పేర్కొన్నారు. ప్రతి నెలా వీలైనంత ఎక్కువ మంది సభ్యులు సమావేశం కావాలని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒకరు మానవతలో సభ్యులుగా చేరేందుకు కృషిచేయాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన సభ్యులను పరామర్శించడం, ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాల్లో మానవత బాధ్యులు హాజరై ఆత్మీయ సహకారం అందించాలని రామచంద్రారెడ్డి చెప్పారు. తెనాలి శాఖ చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ, అద్భుత సమాజం ఆవిష్కరణలో తెనాలి శాఖ ఆదర్శం కావాలని సూచించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ సెంట్రల్ కమిటీగా మానవత సంస్థ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మరిన్ని ఉత్తమ సేవలను అందిస్తామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సెక్రెటరీ పి.వెంకట్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంజనేయరెడ్డి, కోటేశ్వరరావు, మొవ్వ సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, నరసింహారావు, సోమయ్య శాస్త్రి, పి.వాసు, సీహెచ్.సాంబశివరావు, మల్లికార్జునరావు, భుజంగరావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, అర్జున, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణంలోని సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని, ప్రజలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ



నగరంపాలెం: స్థానిక కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థాన ఆవరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు. -స్థానిక లాలాపేట పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. భక్తుల దర్శనార్థం శ్రీస్వామి వారికి దశావతారాల అలంకారం చేశారు. ఉదయం 108 కలశలతో అష్టోత్తర సప్నన అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, శ్రీస్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అం దించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

26న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

బాపట్ల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరుగుతుందని సొసైటీ కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశం రోటరీ కళ్యాణ మండపంలో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆర్థిక నివేదికతోపాటు నూతన కార్యవర్గ ఎంపిక ఉంటుందని, సభ్యులందరు తప్పక హాజరుకావాలని కోరారు.

నర్సింగ్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

దుగ్గిరాల: రాష్ట్రంలోని నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ 4 ఏళ్ల డిగ్రీ కోర్సుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మార్తా నర్సింగ్ కళాశాల చైర్మన్ యనమల ఈశ్వర్ తెలిపారు. తుమ్మపూడి గ్రామంలోని కళాశాలలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ కోర్సు అందుబాటులో ఉన్న కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ తెలిపిందని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గత విద్యా సంవత్సరం ఎంసెట్, నీట్ ద్వారా ప్రవేశం ఉండేదని.. నూతన విధానం ద్వారా ఏపీ నర్సింగ్ టెస్ట్ ద్వారా సీట్ల భర్తీ ఉంటుందని అన్నారు. ఈ విషయం గుర్తుంచుకొని వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. జూలై 6న అర్హత పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన విరామ బైబిల్ తరగతులు

దుగ్గిరాల: ఈమని గ్రామంలో రక్షణ సైన్యం ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న బైబిల్ విరామ పాఠశాల తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాలకు హాజరైన 250 మంది చిన్నారులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అనంతరం విశ్వాసులు పాటలు, బైబిల్ కథలను బోధించారు. కార్యక్రమంలో వెంకట్రావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తెనాలి రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ నందులపేటకు చెందిన ఓ యువతి శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు టూ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం కేసు నమోదు చేశారు.

అనారోగ్య సమస్యలతో వెల్డర్ ఆత్మహత్య

తెనాలి రూరల్: అనారోగ్య సమస్యలతో వెల్డర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన ఈపూరి నాగరాజు(35) రెండు నెలలుగా కామెర్లతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆచార్య ఎన్జీ రంగాకు నివాళులు

పొన్నూరు: రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 30వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం రంగా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రంగా సెంటర్, రంగా స్మృతీవనంలో కమిటీ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్జీ రంగా రైతుల సంక్షేమం కోసం అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రంగా కమిటీ సభ్యులు బొద్దులూరి రంగారావు, వెలగా సుబ్బారావు, ఆకుల జానకిబాబు, గోగినేని అనిల్ కుమార్, గురుబాలు, కంచర్ల రాజేష్‌బాబు, ముట్టినేని మధుబాబు, పెదపూడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. ఆదివారం సుప్రభాత సేవతో ప్రారంభమై, బాల భోగ నివేదన, నీరాజనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నిత్యహోమాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ-ఆంజనేయహవనం పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం విష్ణుసహస్ర నామపారాయణ జరిగింది. అనంతరం ఉత్సవమూర్తులను కనుల పండువగా అలంకరించి విశేష శోభాయాత్ర నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.